

# కాలమ్ దాటని కబుర్లు

బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకి కొన్ని కులాసా కులాసా కబుర్లు

### *డడడా...డడడా...భలే బద్దకం!*

**అమెరికానుండి వచ్చాక వారం రోజులు** జెట్‌లాగ్‌తో పడుకున్నా. అమ్మ టైంకి వండి పెట్టింది. జెట్‌లాగ్ అన్న పేరు ఇంకో వారం డ్రాగ్ చేస్తే అమ్మ నమ్మదని, లేవక తప్పింది కాదు. అసలు టీ.వీలో వచ్చే ఈ ఫుడ్ ఛానెల్స్, కుకరీ షోస్, సీరియల్స్ కన్నా పెద్ద ఎడిక్షన్.

మొన్న ఓ రోజు టీ.వీ తలుపేసుకుని చూస్తుంటే, మా ఆయన తలుపు తోసుకుని వచ్చి నా మంచం మీద బైఠాయించేసారు. తలుపెందుకు వేసుకోవలసి వచ్చిందో మీకు ఇప్పుడు అర్థమవుతుంది.

”ఆప్ అబ్ దేఖ్ రహే హై ‘చౌ చౌ‘ మసాలా కబాబ్” అన్నాడు షెఫ్(వంటవాడు అనకూడదు) ఒక పుచ్చపండు తీసుకుని సన్నగా తరిగాడు, వెన్న వేసాడు, నెయ్యి వేసాడు, పసుపు, కారం, జీలకర్రపొడి, ధనియాలపొడీ, మిరియాలపొడీ, ఏలుకల పొడీ, వాడు అలా వేస్తూ పోతూ ఉంటే మా వారు పక్కనుండి ”సూపర్ బజార్ అంతా వేస్తున్నాడేంటి?”అన్నారు. అలావేసి వేసి ఒక దగ్గర విసుగొచ్చి ఆపి, ఆ ముద్దని పెద్ద పెద్ద ఉండలు చేసాడు.

”అచ్చు తద్దినం అప్పుడు పెట్టే పిండాల్లా చేసాడు” మా వారి కామెంట్.

బాండీ పెట్టి దానినిండా నూనె పోసాడు. ఇప్పుడీ ఉండల్ని నెయ్యిలో ముంచి పైన బ్రెడ్ పొడి అద్దాడు.

”కొలెస్ట్రాల్ పెరిగి చస్తారు” అన్నారు మా ఆయన.

ఆ ఉండల్ని వేయించాడు, ”హమ్మయ్యా” కబాబ్స్ పూర్తి చేసాడు అనుకున్నా. కాదు ఇంకా ప్రోసెస్ అవలేదు. పెరుగులో ఆమ్‌చూర్, పసుపు, వాము, సోంపూ, పచ్చిమిర్చీ, కొత్తిమీరా వేసి గిలకొట్టాడు. ఈ కబాబ్స్ మధ్యలోకి తుంచాడు. ఈ పెరుగు వాటి మీద పోసి పైన ఇంత గడ్డి (అవి బేసిన్ ఆకులూ, పుదీనా, కొత్తిమీరా ఇంకా కొన్ని తెలీని ఆకులూ) టోపీల్లా గుచ్చాడు. పచ్చి నిమ్మకాయ ముక్కలు కోసి పైన అమర్చాడు. టమాటా ప్యూరీ అట మిక్సీలో రసం తీసి ప్లేట్లో చుట్టూ వాకిట్లో కళ్ళాపి చల్లినట్లు చల్లాడు. పెరుగు ప్లేట్ చివర్ల కారేటట్లు జల్లాడు. ఇదంతా డెకరేషనట.

”మొత్తానికి తినడానికి పనికిరాకుండా చేసాడు. ఆ ఛానెల్ తీస్తావాలేదా?” అని మా ఆయన అరిచారు.

అవన్నీ నేనెక్కడ ఆయన మీద ప్రయోగిస్తానో అని తన భయం.

సరే.. తొమ్మిది రోజులు అయిపోయాయి. జీ క్లాసిక్‌లో వచ్చిన ప్రతి సినిమా చూసాను. నచ్చిన ప్రతి పాటా పాడాను. ఇంతలో డ్రైవర్ నాకు పనీపాటా లేదని తెలుసుకుని బావమరిది పెళ్ళని ఊరెళ్ళిపోయాడు. డ్రైవర్ లేడన్న వంకతో ఇంకో వారం హుషారుగా

సినిమాలూ, వంటలూ చూసేసాను. పదోరోజు.. ఇదేంటీ నేనొచ్చి పదిరోజులైంది ఎవరూ రమ్మని పిలవడం లేదు పనికి? అని బెంగొచ్చింది. నాకన్నా పనిమనిషికి ఎక్కువ ఫోన్స్ వస్తున్నాయి. డ్రైవర్ ఇంకా ఎక్కువ బిజీగా ఉన్నాడు. ఎప్పుడు ఫోన్ చేసినా "మీరు ప్రయత్నిస్తున్న నెంబర్ బిజీగా ఉంది.. వేచి ఉండండి" అని వస్తోంది. దాంతో ఇంకా నిరాసక్తత వచ్చింది.

చివరికి డ్రైవర్ ఫోన్ చేసి "ఏంది మేడం?" అన్నాడు. అతని గొంతులో చాలా చిరాకు ధ్వనించింది.

"ఎప్పుడొస్తావ్?" అన్నాను.

"19 వ తారీఖు ఇంట్ల ఉండాలంట. కే.సీ.ఆర్ మూడు ఎకరాల జాగా ఇస్తాడంట గరీబోళ్ళకి. అదైనంక వస్తా" అన్నాడు.

"మూడు ఎకరాలు నాకు కూడా లేవే" (డ్రైవర్‌కి మూడు ఎకరాలు వస్తే నా స్టేటస్ పెరుగుతుందని) అనుకుని వదిలేసుకుని రమ్మంటే "ఏవంత రాచకార్యాలనీ?" అంటాడేమోనని పెట్టేసాను.

గిల్లుకుందామని గోళ్ళు చూసుకుంటుండగా, అమెరికాలో కొన్న నెయిల్ పెయింట్ గుర్తొచ్చి ఆ ప్రయత్నం కూడా విరమించుకున్నాను.

మా ఫ్రెండ్ సుశీల ఫోన్ చేసింది "ఇక్కడ కమ్యూనిటీ హాల్‌లో సంగీతం క్లాసులు ఫ్రీగా చెపుతున్నారు వస్తావా? ఖాళీనేకదా!" అంది. గుండెల్లో కలుక్కుమంది.

పాలవాడు ఆలశ్యంగా వచ్చినా, పోస్ట్‌మేన్ కాలింగ్ బెల్ ఆపకుండా కొట్టినా, పనిమనిషి నాముందు ఫోన్లో "నాకు టైంలేదు.. చాలా పనులున్నాయి" అన్నా ఎంతో గిల్టీగా అనిపించింది. ఇంతలో మా లిల్లీ ఫేస్‌బుక్‌లో నేను పెట్టే వంటలు చూసి "షెఫ్"గా చేరకూడదూ?" అంది. మళ్ళీ 'కలుక్కు'.

ఇలా తీరిగ్గా ఉన్నప్పుడే నాలుగు నవలలు రాయాలి అని మా ఆయన సలహా ఇచ్చారు. నాలుగు పిండి వంటలు చేసి డబ్బాల్లో పెట్టుకోవాలి అన్నట్లు.

"అమ్మా ఇంట్లోనే ఉంటున్నావుగా. కాస్త నా వార్డ్‌రోబ్ సర్ది, పనికిరాని బట్టలన్నీ తీసెయ్యకూడదూ?" అన్నాడు మా అబ్బాయి.

అసలు ఇదివరకు వాడికి నా మొహం కూడా కనిపించేదికాదు. వాడు ఇంటికొచ్చేసరికి నిద్రపోయేదాన్ని. వాడు లేచేసరికి వెళ్ళిపోయేదాన్ని. ప్రతి వాళ్ళకీ అలుసేకదా ఖాళీగా ఉంటే అనిపించింది.

ఫోన్ మోగితే "నేను మీ అభిమానిని" అని మొదలు పెడతారు. మనకి కమ్మగా ఉంటుంది. "చివరకి నా కథ రాయరూ? మీరు ఎక్కడా చూసి ఉండరు. అన్ని మలుపులుంటాయి" అని ముగిస్తారు. దీన్నిబట్టి చూస్తే ఎవరికి వారికి ఈ లోకంలో తాము ఓ గొప్ప చరిత్రకారులమని అభిప్రాయం అనుకుంటా. రచయితలంటే సమాజంలో మరీ అలుసు. ప్రతివాళ్ళూ మా కథ రాయమని అడుగుతారు.

మొన్నామధ్య ఒకావిడ తనది లవ్‌మేరేజ్ అని చెప్పింది.

మనకి నోరు ఊరుకోదుకదా! "ఎలా జరిగిందీ?" అన్నాను.

అంతే. ఆవిడ "చెప్తాను కానీ రాయకండి.. ప్లీజ్ ఎక్కడా రాయకండి.. నా మీద ఒట్టు రాస్తే.. రాయనని మాటిస్తే చెప్తా" అని చివరకి చెప్పడం మొదలెట్టింది. నాకు సగంలోనే నిద్రొచ్చింది. అసలు రచయితలు ఎవరేం చెప్పినా రాయడానికి చెవి వెనక నుండి పెన్సిల్ తీసి రెడీ అయ్యే టైలర్లా? వడ్రంగులా?

ఇంకా కొంతమంది ఉంటారు "మీరు ఫలానా నవలలో అనసూయ పాత్ర నన్ను చూసే రాసారు. మీకు మా ఆఫీసులో పని చేసే మూర్తి చెప్పాడా? మా పక్కింటి శోభ చెప్పిందా? ఆ పాత్ర నేనే. పూర్తిగా నేనే.. నేను మొగుడ్ని వదిలేసి వస్తే మీకేం... మా ఆఫీసర్‌తో ఉంటే మీకేం? మా ఆయనకీ పిల్లలకీ తెలిస్తే ఏవనుకుంటారు? నిజం చెప్పండి.. మీకు నేను తెలుసుకదూ?" అని వేధిస్తారు. "అమ్మా ఈ

అక్రమ సంబంధాలు సృష్టి మొదలైనప్పటి నుండీ ఉన్నాయి. వాటిమీద చాలామందిమి బ్రతికేస్తుంటాం. మీరెవరో నాకు అస్సలు తెలీదు. క్షమించండి" అని దణ్ణం పెట్టినా వదలరు.

జుట్టు తెగ పీక్కుని, పిలకైపోయి, వంటలు కూడా బోర్ కొట్టి, నిద్రపట్టక, వరండా అరిగిపోయేట్లు తెగ పచార్లు చేసి 'నిద్రకు వెలియై.. నేనొంటరినై' అని రోదిస్తూ, ఆకలికూడా చచ్చిపోయి దిక్కుమాలిన ఓట్సే తింటూ, నిర్లిప్తలో మగ్గిపోతున్న తరుణంలో మా ఫ్రెండ్ డాక్టర్ మోహన వంశీ ఫోన్ చేసి లీడర్ షిప్ గురించి ఓ స్పీచ్ ఇవ్వాలి. పాయింట్స్ చెప్పమన్నాడు.

"రేపు పరీక్ష అనగా, సినిమాకి వెళ్తాం అన్న నలుగురు స్టూడెంట్స్‌ని ఆపి కూర్చోపెట్టి చదివించినవాడే నాయకుడు. అదే పరీక్ష ముందు రోజు చదువుకుంటున్న నలుగుర్ని ప్రభావితం చేసి సినిమాకి తీసుకెళ్ళిన వాడూ లీడరే. ప్రభావితం చెయ్యడం ముఖ్యం. గొప్ప అంకితభావం ఉంటే లీడర్ అవుతాడు. అంకితభావానికి ఉదాహరణ నీ గుండె. అది పుట్టినప్పటినుండీ చచ్చేదాకా ఆగదు" అని ఏదేదో చెప్పేసాను. అతను జాటర్ ఢమాల్ అయిపోయి "ఇదంతా ఆడియో మెసేజ్ వాట్స్ఆప్‌లో పెట్టు" అన్నాడు. అతను చెప్పినట్లే చేసి బేలగా "వంశీ నాకు ఒంట్లో బాలేదు." అని నా సిమ్‌టమ్స్ అన్నీ చెప్పాను.

"పనిలేక" అని ఒక్క మాటలో డయాగ్నైజ్ చేసేసి "మంచి నవలరాయి.. ఓ.పీలో పేషెంట్స్ ఎదురు చూస్తున్నారు. తర్వాత చేస్తా" అన్నాడు.

అతనెప్పుడూ తలనొప్పనీ, అన్ని గంటలు నిలబడి ఆపరేషన్స్ చేసి కూడా కాళ్ళు నొప్పులనీ, జ్వరం అనీ అనగా ఇన్నేళ్ళలో వినలేదు. బహుశా పనిలేక పోతేనే రోగాలొస్తాయేమో.. బిజీగా ఉండేవాళ్ళు "ఇప్పుడుకాదు బిజీగా ఉన్నాం" అంటే వెళ్ళిపోతాయేమో అనిపించింది.

సరే ఇంతమంది చెప్తున్నారు కదా నవల రాద్దామని కాయితం కోసం వెతికాను. మా ఇంట్లో తెల్లకాయితం ఛస్తే దొరకదు. ఒకవైపు రాసినవి తప్ప సరే ఒకటి తీసా. రెండో వైపు చదివా.

"అసలు నిన్ను అష్టకష్టాలు పడి కనీ, రాత్రింబగళ్ళు పనిచేసీ, పెంచి పెద్ద చేసింది ఇందుకట్రా?" అంది శాంతమ్మ కొడుకుతో" అని ఉంది.

"మరి ఎందుకూ?" కొడుకు ప్రశ్న.

నాకు ఎంతో నవ్వొచ్చింది. నిజమే ఏ నవలలో అయినా, సినిమాలో అయినా కొడుకు తన ఇష్టానికి వ్యతిరేకంగా పెళ్ళిచేసుకుంటానంటే ఇదేమాట అడుగుతారు తల్లులు. "మరి ఎందుకూ?" అని కొడుకు అడగడు, అడిగితే ఏవిటి వాళ్ళ సమాధానం?

అక్కడనుండి నవల కంటిన్యూ చేద్దామా? అనుకున్నాను.

అయిన లేట్ ఎలాగూ అయింది. సినిమా కథే రాయండి అన్నారు భువనచంద్రగారు ఫోన్‌లో. ఓసారి సినిమా కథ ఎలా ఉండాలో అని నెమరు వేసుకున్నాను.

1960 నుండి 70 వరకూ ఒక అమ్మాయి ఒక అబ్బాయి ప్రేమలో స్లోగా పడడం, స్లోగా పాటలు పాడడం.. పెద్దల జోక్యం, పేదరికం "పేదరికమ్ము, ప్రేమపథమ్మును మూసీ వేసినదా? నా ఆశా దోచినదా?"

"ప్రేమే నేరమౌనా? మా పై పగేలా? వేదనగనే మా బ్రతుకంతా వేసారునా?" ఈ టైపులో ఉన్నాయి. మధ్య మధ్యలో వర్షాలు పడకపోవడం.. భూములు బీటవారడం, తండ్రి క్షయ పిల్లలు అడుక్కోవడం.. దరిద్రం. అప్పటి కాలమాన పరిస్థితుల ప్రకారం తీసారు. అవికూడా అందంగా "మిత్వా... ఓ మిత్వా" అని అందంగా, కమర్షియల్‌గా గ్లామరస్‌గా లగాన్‌లా తియ్యలేకపోయారు.

"పృధ్వీవ్ వల్లభ్.. ముజే ప్యార్ కరోగే క్యా?" అన్నమాట దుర్గాఖోటే (pause) పాజ్ ఇస్తూ పది నిమిషాలు చెప్పింది.

ఇప్పుడొస్తున్న సినిమాల్లో అయితే ఆ పాటికి హీరోయిన్ కడుపు మోస్తూ "సచ్చినోడా.. ఇదంతా నీ వల్లే.. ఎందుకు కనపడ్డావురా? నీ ..(బీప్).. (బీప్)" అన్న డైలాగ్ పదినిమిషాల్లో తెరపై వచ్చేసేది.

ఎన్ని అన్‌సెన్సార్డ్ సినిమాలు ఈ బుర్రలో నిక్షిప్తమై ఉన్నాయో ఒక సెన్సార్ బోర్డ్‌మెంబర్‌గా - ఏం చెప్పమంటారూ?

ఇంక 1970 నుండీ 80 దాకా వచ్చిన సినిమాల్లో అయితే... హీరో బి.ఏ. పరీక్షకి కడతాడు. ఫీజ్‌కి డబ్బులుండవు. తండ్రి అప్పులభారంతో, అవమాన భారంతో ఆత్మహత్య చేసుకుంటాడు. పోయేవాడు పోడు "మీ అమ్మనీ, చెల్లెల్నీ, తమ్ముడినీ కంటికి రెప్పలా చూసుకుంటావు కదూ!" అని ఉత్తరం రాసి పెడ్తాడు.

"నాన్నా" అని హీరో చితి దగ్గర కుమిలి కుమిలి ఏడుస్తాడు. తల్లి మిషన్ కుడ్తుంటుంది, క్షయ.. దగ్గితే రక్తం. గుడ్డి చెల్లి "అన్నయ్యా!" అంటూ గుమ్మం తగిలి బోర్లాపడ్తుంది. పోలియో తమ్ముడు, చంకల కింద కర్రలతో "నేను నీకు భారం అయిపోయాను" అని వెక్కి వెక్కి ఏడుస్తూ. ఇంటి ఓనర్ భీకరంగా అరుస్తూ, కళ్ళు చక్రాల్లా తిప్పుతూ, గూడలెగరేస్తూ "అద్దె కట్టకపోతే బయటకి పొండి, రైలుకింద తలపెట్టి చావండి. మీ నాన్నని చూసైనా బుద్ధి తెచ్చుకోండి" అంటాడు. ఇంతలో ఓ గొప్పింటి అమ్మాయ్ కారు కింద హీరో పడబోవడంతో కథ మలుపు తిరుగుతుంది. స్టీరింగ్ గిరగిరా తిరుగుతుంది.

ఆ తర్వాత..

విలన్ హీరోయిన్‌ని రేప్ చెయ్యడానికి తరుముతుంటాడు. హీరోయిన్ ఎవరూ లేని ప్రదేశాలూ, రాలేని కొండ చివర్లకి చేరుకుంటుంది. విలన్ వికటాట్టహాసం చేసి ఆమెని అందుకోబోయేలోపల నాలుగుసార్లు క్రింద పడి, చీర చెరుగు దేనికో చుట్టుకుని, ప్రయాసపడి లేస్తుంది. ఆడియన్స్‌లో మగవాళ్ళకి ఓ రకం ఉత్తేజం, ఆడవాళ్ళలో ఉద్వేగం ఒక రేంజ్‌కి పెరిగిపోయి, విలన్ ఆమె మీద పడే టైంలో ఒక బూట్ కాలు అతని మొహాన్ని తంతుంది. హీరో వస్తాడు. ఆమె ఆరాధనగా చూస్తూ, గుండెల్ని చేతుల్తో కప్పుకుంటుంది.. తన శీలాన్ని రక్షించేవాడొచ్చాడు అని. విలన్‌ని అతను చిత్తుగా కొట్టి కొండమీద నుండి తోసేసి ఆమె దగ్గరకి వస్తాడు. హోరున వర్షం కురవడం మొదలుపెడ్తుంది. ఆ గుహలో అతను చితుకులతో మంట చేస్తాడు. ఆమె అక్కడ చలికాచుకుంటూ ఉండగా ... బలహీనమైన ఘడియలు మొదలవుతాయి. ఆమె, అతనూ ఒకటౌవుతారు. ఆ తరువాత సీన్‌లో ఆమె తల్లి కాబోతున్నట్లు సూచనగా వాంతి అవుతుంది.

"సీతా.. నేను మా నాన్నగారి కోరిక మీద విదేశాలకి వెళ్తున్నాను. రాగానే మన పెళ్ళి" అని రాము ఉత్తరం ఆమె చేతిలో రెపరెపలాడ్తుంటుంది "నా నావా వెళ్ళిపోయిందీ.. నన్నొదిలీ వెళ్ళిపోయిందీ" అనే పాట నేపథ్యంలో. ఇంతకీ విలన్‌కీ హీరోకీ తేడా ఏవిటి?

ఇలా 1980 వరకూ సాగాకా, 1990 నుండీ హీరో రాగానే టాటా సుమోలు గాల్లోకి లేవడం "ఈ సీమలో పుట్టిన పసిపిల్లాడు కూడా కొదమ సింహంలా గర్జిస్తాడు" లాంటి డైలాగ్స్ మొదలయ్యాయి.

2000 నుండీ కుర్ర హీరోలొచ్చేసారు. కాలేజీలో మాస్టర్స్ హీరోయిన్లని "ఏవిటే.. ఇది మట్టే కదే. ఇయ్యవే" అంటే "పోరా ఏంట్రా.. దొంగ నా.." అనే బూతులూ సర్వసాధారణం అయ్యాయి. హీరో ప్రేమించే అమ్మాయి తప్పకుండా ఒక గూండా గ్యాంగ్‌స్టర్ లేదా పరమ దుష్ట పొలిటీషియన్ కూతురై ఉంటుంది. హీరో రౌడీ షీటరై ఉంటాడు. పోలీస్ స్టేషకి వెళ్ళి సైన్ పెట్టి రావడం అతని క్వాలిఫికేషన్, అతని తల్లి (చుడీదార్‌లో) తండ్రి కొడుకుతో కలిసి మందు కొడ్తూ ఉంటారు.

"వెళ్ళరా వెళ్ళు మగాడివైతే వెళ్ళి ఆ అమ్మాయిని ఎత్తుకురా" అని రెచ్చకొట్టే తల్లిపాత్రలొచ్చాయి.

ఆ గ్యాంగ్‌స్టర్‌కి బుద్ధి చెప్పడం కోసం ఆ అమ్మాయిని ప్రేమిస్తాడో, లేక ఆ అమ్మాయిని ప్రేమించాడు కాబట్టి ఆ విలన్‌కి బుద్ధి చెప్తాడో అస్సలు అర్థం కాదు. తమాషా ఏవిటంటే ఆ విలన్ లేదా గూండా, గ్యాంగ్‌స్టర్ ఏదో ఒక పని చేసుకుంటూ బిజీగా ఉంటాడు. ఈ హీరో ఎప్పుడూ పోరంబోకు తిరుగుడు తిరుగుతూ "నాకు తిక్క" లేదా "నేను పిచ్చెక్కితే ఎవర్ని కరుస్తానో తెలీదూ" లాంటి డైలాగ్స్ చెప్తూ, బ్యాడ్ బోయ్ అనే మాటకి పక్కా ఉదాహరణలా కనిపిస్తాడు. ఆడపిల్లలు అలాంటి హీరోలకోసం పిచ్చి క్రేజ్ చూపిస్తుంటారు.

ఇంక నేను సెన్సార్ బోర్డ్ మెంబర్ అయినప్పటి నుండీ నా ఖర్మ. ఎప్పుడూ ఒక కాలేజీ పదిమంది అబ్బాయిలూ, పదిమంది అమ్మాయిలూ ఉన్న సినిమాలే. అందులో ఏ ఒక్కరూ ప్రముఖ పాత్ర వహించరు. వాళ్ళు కాలేజీలకి వచ్చేదే సెక్స్ కోసం అన్నట్లు మాట్లాడుకుంటూ ఉంటారు. కండోమ్స్, అబార్షన్స్, వయాగ్రాలూ ఇవన్నీ కాలేజీలో తరచూ మాట్లాడుకునే టాపిక్స్.

ఈరోజుల్లో అసలు అమ్మాయిలు అబ్బాయిలతో ఫ్రెండ్‌షిప్ చేసేదే, షాపింగ్‌ల పేరుతో వాళ్ళ జేబులు ఖాళీ చెయ్యడానికి అని నొక్కి చెప్తున్నా, అమ్మాయిలు శీలం అంటే 'ఆ తొక్క!' అని నిర్లక్ష్యంగా వ్యవహరించి, తొందరపడి కడుపులు తెచ్చుకుని అబార్షన్‌లు ఫెయిలయి నాటు పద్ధతులకెళ్ళి, చచ్చిపోతున్నారు, లేక వీళ్ళ ప్రణయాన్ని బ్లూఫిల్మ్‌లుగా డబ్బు చేసుకునే అబ్బాయిలకి అమ్ముడు పోతున్నారు అనే రొమేంటిక్ క్రైం కథలొచ్చినా, అమ్మాయిల్లో అబ్బాయిల్లో ఏ మాత్రం పరివర్తన లేదు! "అయ్యో ఇవన్నీ అబద్ధాలు, మా ఆత్మాభిమానం దెబ్బతింది" అనే ఒక్క అమ్మాయీ లేదు.

'కసాయి' అనే మాట సినిమాల్లో వాడితే కటిక కులం వాళ్ళు "మా కులవృత్తిని కించపరిచారు" అంటూ సెన్సార్ బోర్డ్ మీదకి దండెత్తి వస్తారు.

నపుంసకుల మీద జోకులేస్తే, వాళ్ళు కూడా సెన్సార్ బోర్డ్ మీదకి గొడవ చెయ్యడానికొస్తారు.

కానీ ఆడవాళ్ళని అందులోనూ అమ్మాయిలు కాలేజీలకెళ్ళేది 'ఈ పనికొసమే' అని చెప్తున్నా ఒక్క పిల్లకూడా ప్రతిఘటించలేదు.. నా సర్వీసులో.

సో.. సినిమా కథ కూడా ఇంత ఆలోచించాకా ఏం కథ రాయాలో అర్థం కాలేదు. నేను గతంలో రాసిన 'రేపల్లెలో రాధ', 'మధుమాసం' 'అందరిబంధువయా' లాంటి నీతులు ఇప్పుడు రాస్తే, సెన్సార్ ఆఫీసుకాదు, నా ఇంటిమీదకే దాడి చేసేట్లున్నారు.

నేను పనిలేక ఈ కాలం రాస్తున్నానని తెలిసినట్లుంది, దూరదర్శన్ వారు ఫోన్ చేసి ఈనెల అంటే ఆగస్ట్ 31న పాత, కొత్త సినిమా సాహిత్యం మీద సమీక్ష చెయ్యాలని కోరారు. ఎంతైనా డీడీ1 వాళ్ళకి మొదటినుండీ దివ్యదృష్టి ఎక్కువ. మేం టీ.వీ కొన్న కొత్తల్లో, వినాయక చవితిరోజు 'ఎలుకని చంపడం ఎలా?' ప్రసారం చేసేవారు. ఎప్పుడు ఏడు అవుతుందా? శాంతిస్వరూప్, విజయదుర్గా, రోజారాణీ వస్తారా? అని ఎదురు చూసిన రోజులవి. ముందు మాట రాయమని పుస్తకానికి ఒకళ్ళిద్దరు అడుగుతున్నారు.. రాశేద్దాం!

అబ్బా... సినిమాకి కథ రాద్దాం. నవల రాద్దాం, కొత్త వంటలు చేద్దాం. అనుకునే లోపల "ఈ టీ.వి సీరియల్" చెయ్యమని ఫోన్ వచ్చింది. గురువుగారు పరుచూరి గోపాలకృష్ణగారు కూడా పని ఉంది రమ్మంటున్నారు. ఎలాగబ్బా తప్పించుకోవడం? బద్ధకంలో ఉన్న ఆనందం.. అబ్బా.. అనుభవించాలే కానీ చెప్పలేం... చెప్పాలంటే చచ్చే బద్దకం.

Post your comments

